# పర్మిషన్ — రాగంపూడి శ్రీనివాస్




"ఈరోజు నువ్వు నాకు ఓ చిన్న సహాయం చెయ్యాలిరా" అంటూ నా దగ్గరికి వచ్చాడు శివరావ్.

నేను ఫైల్లోంచి తలెత్తి ఏం సాయం అన్నట్టు చూశాను.

"నాకు నువ్వు ఎలాగైనా ఈ సాయం చెయ్యాలి" అన్నాడు మళ్ళీ.

"ఏమిటో చెప్పుముందు" అన్నాను నేను కాస్త చికాగ్గా.

"విషయం ఏమిటంటే..." అంటూ మొదలు పెట్టబోయాడు.

యింతలో ఆఫీస్‌బాయ్ వచ్చి "సార్ మిమ్మల్ని రమ్మంటున్నారు" అన్నాడు నాతో.

నేను హడావుడిగా ఫైల్స్ మడిచి మేనేజరు గదివైపు వెళ్ళాను.

శివరావ్ నేను ఒకటే సెక్షన్‌లో పనిచేస్తున్నాం. మా సెక్షన్‌లో మేమిద్దరమే గుమాస్తాలం. సమవయస్కులం అవ్వడం వలన యిద్దరం ఒకటే హోదాలో వుండడం వలన బాగా దగ్గరయ్యాం.

నేను మేనేజరు రూమ్‌లోంచి తిరిగి వచ్చేసరికి శివరావ్ అక్కడే కూర్చుని వున్నాడు. వాడి మొహంలో నాకు యేదో చెప్పాలన్న ఆందోళన కనిపిస్తోంది.

"ఊ! ఇప్పుడు చెప్పు" అన్నాను నేను కూర్చుంటూ.

"ఏం! లేదు! నువ్వు 2 గంటలకి ఆఫీస్ నుంచి వెళ్ళిపోవడానికి పర్మిషన్ అడిగావటకదా".

"అవును అడిగాను" అన్నాను నేను.

"ఈ ఒక్కసారి నువ్వు పర్మిషన్ విత్‌డ్రా చేసుకోరా! నేను ఈ రోజు 2 గంటలకి యింటికి వెళ్ళడానికి మేనేజర్‌ని పర్మిషన్ అడిగాను. ఒకటే రోజు మీ యిద్దరికి ముందుగా వెళ్ళడానికి పర్మిషన్ ఎలాగివ్వాలి అని మేనేజర్ గొణుగుతున్నాడు. మా అమ్మాయికి ఒంట్లో బాగాలేదు. నిన్నట్నుంచి ఒకటే వాంతులు, విరోచనాలు. మధ్యాహ్నం 2 గంటలకి సరాసరి యింటికెళ్ళి దాన్ని డాక్టర్ దగ్గరికి తీసుకెళ్ళాలి" అన్నాడు.

నేను "సారీ బ్రదర్! ఈ రోజు మా వూరి నుండి మా బాబయ్య టెలిఫోన్ చేశాడు. మా బామ్మకి అస్సలు ఒంట్లో బాగాలేదట. వెళ్ళి చూసిరాకపోతే బాగుండదు. ఈ రోజుమధ్యాహ్నం 2.30కి బస్సులో వెళ్ళి అక్కడ కాసేపుండి మళ్ళీ రాత్రి 10.30కి బస్సులో తిరిగి వచ్చేయ్యాలి" అన్నాను.

"అది కాదురా! మా అమ్మాయిని స్పెషలిస్టు దగ్గరికి తీసుకెళ్ళాలి. అపాయింట్‌మెంట్ కూడా ఫిక్స్ చేశాను" అన్నాడు.

"మా బామ్మ పాపం మంచానుంది యిదే ఆఖరి చూపు అవుతుందేమో" అన్నాను నేను ఎంతో దిగులుగా.

యింతలో ఆఫీస్‌బాయ్ వచ్చి "సార్ మిమ్మల్నిద్దర్ని రమ్మంటున్నారు" అని అన్నాడు.

మేమిద్దరం గదిలోకి వెళ్ళేసరికి మేనేజర్ గురునాథం "ఏమయ్యా! ఈ సెక్షన్‌లో మీరు ఇద్దరే గుమాస్తాలు. మీరిద్దరూ ఒకటే రోజు పర్మిషన్ కావాలంటే ఎలాగా" అన్నాడు.

మేమిద్దరం మాట్లాడలేదు.

"కొంపతీసి యిద్దరూ కల్సి సినిమాకి ప్లాన్ వేయలేదుకదా" అన్నాడు మేనేజరు పెద్ద సీక్రెట్‌ను బయట పెట్టినట్టుగా నవ్వుతూ.

నేను ఉలిక్కిపడ్డాను. వీడికి ఎలా తెల్సింది నా ప్లాన్. కొంపతీసి నేను పర్మిషన్ అడగడానికి కారణం శివరావ్ గాడికి తెల్సా అని తలత్రిప్పివాడివైపు చూశాను. వాడు మాత్రం నాకుమామూలుగా కనిపించాడు.

మళ్ళీ గురునాథం "సరే ఈ ఒక్కసారి కాదనను" అన్నాడు.

నేను, శివరావ్ గట్టిగా ఊపిరి పీల్చుకుని బయటికి వచ్చాము.

నేను నా సీటు దగ్గరకొచ్చి. జేబులోంచి ఈ రోజే విడుదలైన నా అభిమాన సినీ హీరో యొక్క సినిమా టిక్కెట్‌ను బయటికి తీసి అభిమానంగా చూసుకున్నాను.

శివరావ్ 2 గంటలకు పనికట్టేసిహడావుడిగా వెళ్ళిపోయాడు.

నేను 2.30 నిమిషాలకి ఆఫీస్ నుంచి బయటపడి థియేటర్‌కి ఆటోలో వెళ్ళాను. నేను థియేటర్‌కి చేరేసరికి 2.50 నిమిషాలయ్యింది.

నేను లోపలికి వెళ్ళేసరికి న్యూస్‌రీల్ వస్తోంది. హాలంతా చిమ్మచీకటి. ఎలాగో ప్రయాసపడి సీటు నెంబర్ చూసుకుని కూర్చున్నాను.

ఐదు నిమిషాలలో సినిమా మొదలైంది. నా అభిమానహీరో సినిమా మొదట రోజు చూస్తున్నందుకు నాకెంతో తృప్తిగా వుంది. హీరో చేసే డాన్సులు, ఫైట్స్ చూస్తుంటే నా ఆనందానికి హద్దులులేవు.

యింతలో యింటర్‌వెల్ అయ్యింది.

నేను బయటికి వెళదామని సీటులోంచి లేస్తూ ప్రక్కనున్న శివరావ్‌ని చూసి కొయ్యబారి పోయాను. వాడికి నోటమాట రాక అలా గుడ్లప్పగించి నన్ను చూస్తూండిపోయాడు.

ముందు శివరావ్ తేరుకుని "మా బామ్మగారికి ఒంట్లో బాగాలేదు ఊరెళ్ళాలి అని అబద్దం చెప్పి పర్మిషన్ పెట్టి, సినిమాకి వచ్చావా?" అన్నాడు కోపంగా నన్ను చూస్తూ.

నేను తాపీగా "నువ్వు మాత్రం మీ అమ్మాయికి ఒంట్లో బాగాలేదు. స్పెషలిస్టు దగ్గరికి తీసుకెళ్ళాలి అన్నావు కదా" అన్నాను.

నా మాటలకి వాడు గతుక్కుమన్నాడు.

తరువాత మొత్తం విషయం గుర్తుకు తెచ్చుకొని పగలబడి నవ్వుకున్నాం.

వాడు అభిమాన హీరో నా అభిమాన హీరో ఒక్కడే అని తెలిస్తే యింత యిబ్బంది వుండేది కాదేమో.

ఎలాగో యిద్దరం దొంగలమే కాబట్టి జరిగిన విషయం ఎవ్వరికీ చెప్పకుండా నోరుమూసుకుని వూరుకున్నారు.